క్లుప్తంగా

అరుణాచలేశ్వరస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు


స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. పండితులు స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామలింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

గండేపల్లి: తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రౌతులపూడి: స్థానిక ఎస్సీపేట పాతకాలనీ, కొత్త కాలనీల్లో డ్రైన్లు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీపేటకు చెందిన వార్డు సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా పేటలో ఏ విధమైన అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదులో వివరించారు. తమ సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని కోరారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించండి

రౌతులపూడి: స్థానిక బీసీ కాలనీలో గత కొంత కాలంగా విద్యుత్ లో వోల్టేజీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యుత్ ఏఈ చినబాబుకు కాలనీవాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. విద్యుత్ లో వోల్టేజీ వలన ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఘనంగా మంటలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


నదీ జలాలతో ప్రదర్శన చేస్తున్న మహిళలు

కిర్లంపూడి: మండలంలోని పాత కృష్ణవరం గ్రామంలో వేంచేసిన మంటలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఏలేరు నదీ జలాలతో పుర ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మహిళలు ఆలయానికి చేరుకుని నదీ జలాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి లలితా పారాయణం గావించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

పిఠాపురం: అనుమతులు లేకుండా తరలిస్తున్న నాలుగు గ్రావెల్ ట్రాక్టర్లను ఆదివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో చేబ్రోలు వీఆర్వోకు వచ్చిన సమాచారం మేరకు చేబ్రోలు నుంచి దుర్గాడ వెళ్లే శ్మశానం రోడ్డులో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను గొల్లప్రోలు పోలీసు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్రాక్టర్ల డ్రైవర్లు పడాల మంజునాథ, పడాల వెంకటేశ్వరరావు, కందా నారాయణమూర్తి, గంట వెంకటరమణలను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయాన్ని మైనింగ్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698

ఇదేం దారిద్ర్యం ?


కంకర రాళ్లు పైకి లేచిపోయి అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

- అధ్వానంగా ఏలేశ్వరం-జె.అన్నవరం రహదారి
- గత ఎన్నికల్లో హడావుడి చేసిన టీడీపీ నేతలు
- ఏడాది గడుస్తున్నా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఏలేశ్వరం: తమది మాటల ప్రభుత్వమే కాని చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపించుకుంది కూటమి ప్రభుత్వం. ఎన్నికలకు ముందు తమకు అధికారమిస్తే వెంటనే రహదారి నిర్మిస్తామని హడావుడి చేసిన టీడీపీ నేతలు అధికారం చేపట్టి ఏడాదవుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుత ఎమ్మెల్యే అప్పట్లో రహదారిపై ఇటుకలతో గోడ నిర్మించి నిరసన తెలిపారు. అధికారంలోకి రాగానే రహదారిపై తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో ప్రజల కష్టాలు తీరకపోగా మరింత పెరిగాయి. ఈ రోడ్డుపై వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏలేశ్వరం నుంచి సి.రాయవరం, రమణయ్యపేట, తూర్పులక్ష్మీపురం, జె.అన్నవరం గ్రామాల మీదుగా



ఎన్నికల ముందు రహదారిపై గోడ నిర్మిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ (ఫైల్)

ఏజెన్సీ వెళ్లే ప్రధానరహదారి శిథిలమైంది. ఈ రహదారి మీదుగా అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, గంగవరం, రంపచోడవరం మండలాలకు రాకపోకలు జరుగుతుంటాయి. నిత్యం వందలాది వాహనాల్లో వేలాదిసంఖ్యలో ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. గత ప్రభుత్వం రహదారి నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించింది. అప్పట్లో కొన్ని ఇబ్బందులు రావడంతో రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. దీనిని ఆసరాగా తీసుకున్న కూటమి ప్రభుత్వం నానా హైరానా చేసి ప్రజలను మోసం చేసింది.

గోతులు పూడ్చి..

రహదారి నిర్మాణంపై కూటమి ప్రభుత్వ నుంచి స్పందన కరువైంది. అధికారం చేపట్టిన తొలినాళ్లలో రహదారిపై అక్కడక్కడ గోతులు పూడ్చారు. ప్రస్తుతం రహదారిపై రాళ్లు పైకి లేచిపోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో పాటు వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము లేచిపోవడంతో వెనుక వచ్చే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ముధూళిలో ఎదురుగా వచ్చేవారు కనపడకపోవడంతో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



అధికారం చేపట్టి ఏడాదవుతున్నా రహదారి నిర్మాణాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో రహదారిపై రాకపోకలు నరకప్రాయంగా మారాయి.

– యిజనగిరి శివప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు తూర్పులక్ష్మీపురం

రహదారి నిర్మాణం చేపట్టాలి



కూటమి ప్రభుత్వం రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలి. రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని గాలికి వదలకుండా నిర్మాణం పూర్తి చేయాలి.

– గుమ్ములూరి వెంకటరమణ, సి.రాయవరం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

రౌతులపూడి: మంచి పోషకాలు లభించే చిరుధాన్యాలు, ఆకుకూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ మండల విస్తరణాధికారి జానకీలక్ష్మి అన్నారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని ములగపూడిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజసిద్ధంగా పండించే చిరుధాన్యాలతో పాటు మంచి ఆకుకూరలను తీసుకోవటం వలన రక్తహీనతను నివారించవచ్చన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సత్యవతి, రమణమ్మ, అచ్యుత, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం ఆరోగ్యానికి మేలు

ప్రత్తిపాడు రూరల్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం సాగించడం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ జేడార్ పద్మావతి అన్నారు. మండలంలోని ధర్మవరంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో


ములగపూడిలోగర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న జానకీలక్ష్మి

భాగంగా పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులు, కిషోర బాలికల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, కార్యదర్శి కామరాజు, అంగన్‌వాడీ సూపర్ వైజర్ వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని తొలగించాలి

శంఖవరం: మండలంలోని కొంతంగికొత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన అక్రమ కల్యాణ మండపాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఎటువంటి పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్నారన్నారు. దీనిపై గతంలో ప్రజాదర్బారులో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఏలేరు, పుష్కర కాలువ నడుమ ఉన్న మట్టిని తొలగించి అక్రమంగా కట్టడాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ భవనాన్ని గ్రామానికి చెందిన ఆకేటి పెద్దకాపు నిర్మిస్తున్నాడని, దీనిపై సర్వే చేయించి నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా కల్యాణ మండపం నిర్మాణానికి పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.


కొంతంగికొత్తూరులో అనుమతులు లేకుండా నిర్మించిన కల్యాణ మండపం

రైతుల దారి సమస్య పరిష్కారానికి చర్యలు

గోకవరం: రైతుల పంట పొలాల్లో మార్గానికి చర్యలు చేపడుతున్నట్టు జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ తెలిపారు. గోకవరం రంపయర్రంపాలెం గ్రామాల మధ్యలోని బురద కాలువ సమీపంలో ఉన్న సుమారు 300 ఎకరాల ఆయకట్టు కలిగిన పంట పొలాలకు దారి మార్గం లేకపోవడంతో సమస్యను స్థానిక రైతులు సోమవారం ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఆయన ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి రహదారి సమస్యపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల రహదారి సమస్య పరిష్కారానికి ఆలోచన చేస్తున్నామని, గత రికార్డులు ప్రకారం సుమారు 50 మీటర్ల కాలువ గట్టు మార్గం ఉందన్నారు. ఈ విషయంపై రైతులను వెంట బెట్టుకుని వెళ్లి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వినతి పత్రం అందజేస్తామన్నారు. ఆయన వెంట సూరంపాలెం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉంగరాల రాము, గోకవరం సొసైటీ మాజీ చైర్మన్ గాజంగం సత్తిబాబు, తదితరులు ఉన్నారు.


గోకవరంలో రైతుల దారి సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ప్రకృతి సాగుతో నాణ్యమైన దిగుబడులు

రౌతులపూడి: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా ఆరోగ్యవంతమైన, నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చని మండల వ్యవసాయ విస్తరణాధికారి సీహెచ్ గోపీనాథ్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ డి.వరలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి సాగు ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. సహజ ఎరువులు ఆవుపేడ, మూత్రంతో పాటు, జీలుగ, జనుము వంటి పచ్చిరొట్టతో రైతులు స్వయంగా తయారు చేసుకున్న ఎరువులు, క్రిమిసంహారక మందులను వాడటం వలన ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చన్నారు. రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేపట్టే పలువురు రైతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి, ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరావు, నాయకులు పైల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


రౌతులపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ గోపీనాథ్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

జగ్గంపేట: మండల పరిధి గొల్లలగుంటలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం ప్రకృతి వ్యసాయ పద్ధతులను పాటించిన ఉత్తమ రైతులను సన్మానించారు. ఎంటీ పడాల భాస్కర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం అద్దేపల్లి అచ్యుత రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. కాకినాడ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండల పరిధిలోని 15 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అలింకో సంస్థ సహకారంతో వీల్ చైర్లు, సీపీ చైర్లు, రో లెటర్లు, ట్రై సైకిళ్లు, చెవిటి మెషీన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 వై.అచ్చిరాజు మాట్లాడుతూ భవిత సెంటర్ ద్వారా అందిస్తున్న ప్రత్యేక శిక్షణ, ఫిజియోథెరపీ వంటి సేవలు పిల్లల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. వీటిని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, టీడీపీ మండల అధ్యక్షుడు అమరాధి వెంకట్రావు, హెచ్‌ఎం కె. చిన రామమూర్తి, స్థానిక నేతలు బొల్లు కొండబాబు, అద్దేపల్లి రాజా, దాట్ల అప్పన్న బాబు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పల్లెల్లో పారిశుధ్యానికి పెద్దపీట

సాక్షి ఎఫెక్ట్

కోటనందూరు: పల్లెల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తున్నామని పంచాయతీ విస్తరణాధికారి ఎస్. జయరాం తెలిపారు. సోమవారం పల్లెల్లో 'చెత్త' నిర్వహణ శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కోటనందూరు, కాకరాపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు, గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో చెత్త సేకరణ, తరలింపుపై గ్రీన్ అంబాసిడార్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. పారిశుధ్య పరంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజలంతా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


కోటనందూరులో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ జయరాం

రేపు స్పాట్ అడ్మిషన్లు

తుని: స్థానిక గవరపేట ఉమారామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం కాంచీపురం శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయం(ఎస్‌సీఎస్‌వీఎంవీ) విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. బీఈ, బీ టెక్, బీఎస్సీ, బీసీఏ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంఎస్సీ, ఎంఈ, ఎం టెక్ కోర్సులకు అడ్మిషన్లు ఇస్తారన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు సమావేశం నిర్వహించి ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. తుని పరిసర ప్రాంతాల్లో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశానికి హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పాట్ అడ్మిషన్లపై అవగాహన

తొండంగి: కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చంద్రశేఖరేంద్ర సరస్వతీ విశ్వమహావిద్యాలయంలో ఇంజినీరింగ్, పీజీ కోర్సుల అడ్మిషన్లపై సోమవారం మండలంలోని బెండపూడి శివారు సుబ్బరాయపురంలో జిల్లా ఉపాధ్యక్షులు కొండవీటి రామలింగేశ్వరశర్మ అవగాహన కల్పించారు. విద్యాలయంలో బీటెక్ ఇంజినీరింగ్‌తో పాటు ఎంబీఏ, ఎంసీఏ, ఎంఇ, ఎంఎస్సీ, యూజీ కోర్సులు బీఈ, బీఈడీ, బీఎస్సీ, బీసీఏ, బీకామ్, బీబీఏ, బీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బుధవారం తుని గవరపేట శివాలయంలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు.

భానుడి భగభగలు

- మండిపోతున్న ఎండలు
- అల్లాడుతున్న ప్రజలు

ప్రత్తిపాడు రూరల్: ప్రస్తుత వేసవిలో భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. గత పది రోజులు సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. ఒక పక్క ఉష్ణోగ్రతలు మరో పక్క ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారం నుంచే ఎండలు తారస్థాయికి చేరుకున్నాయి. ప్రత్తిపాడు మండలంలో ఈ వేసవిలో ప్రప్రథమంగా గత నెల 29న 40 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఈ నెల 12న 41న డిగ్రీ ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుతం 36–38 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. సోమవారం ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగింది. సాధారణ ఉష్ణోగ్రతలు కన్నా అదనంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోయారు. అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రధాన కూడళ్ల, రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండ వేడిని తట్టుకోలేక 16వ నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రోడ్లకు ఇరువైపులా చెట్ల కింద వాహనాలను నిలిపివేశారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు ఎండ నుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి వాటిని వినియోగించారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు శీతలపానీయాలను ఆశ్రయించారు. ఫలితంగా జ్యూస్‌లు, కొబ్బరి బొండాల విక్రయాలు జోరందుకున్నాయి.


రాచపల్లి అడ్డురోడ్డు వద్ద నిర్మానుష్యంగా మారిన 16 నంబర్ జాతీయరహదారి


ప్రత్తిపాడులో ఎండ నుంచి రక్షణగా గొడుగును ఆశ్రయించిన యువతులు

బాధిత కుటుంబానికి కృష్ణుడి పరామర్శ

కోటనందూరు: మండలంలోని బొద్దవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఆళ్ల అప్పారావు ఇటీవల మాతృ వియోగం పొందారు. వైఎస్సార్ సీపీ నాయకులు యనమల కృష్ణుడు సోమవారం బొద్దవరంలో అప్పారావు స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అప్పారావును తల్లి మృతికి కారణాలు అడిగి తెలుసుకొని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గొర్లి రామచంద్రరావు, మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, నాయకులు వేగి అప్పలనాయుడు, దొడ్డి బాబ్జీ, యల్లపు సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


బొద్దవరంలో అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న యనమల కృష్ణుడు

ఏవీ నగరం పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్

తొండంగి: మండలంలోని ఏవీ నగరం పీహెచ్‌సీకి నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికేషన్ దక్కిందని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ సోమవారం తెలిపారు. ఆస్పత్రి పరిసరాల నిర్వహణ, పరిశుభ్రత, మందుల పంపిణీ, ప్రజా సేవ తదితర అంశాల ఆధారంగా ఎన్‌క్యూఏఎస్ బృందం పలు పీహెచ్‌సీలను ఎంపిక చేస్తుంది. దీనిలో భాగంగా ఈ విడత ఏవీ నగరం పీహెచ్‌సీ సాధించడంతో కాకినాడలో కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ మెమెంటోనూ అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఆస్పత్రి వైద్యులు, ఇతర సిబ్బంది సిబ్బందిని కలెక్టర్‌తో పాటు డీఎంఅండ్ హెచ్ఓ నరసింహనాయక్ అభినందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భారతి, పీహెచ్‌ఎన్ ఏసురత్నం, ఎంపీహెచ్‌ఎస్.సత్తిబాబు, ల్యాబ్‌టెక్నీషియన్ అలేఖ్య, ఫార్మసిస్ట్ రాజయ్య, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సాయం కోసం వెళితే సెల్‌ఫోన్ చోరీ

గండేపల్లి: సాయం చేద్దామని వెళ్లిన వ్యక్తి సెల్‌ఫోన్ చోరీ చేసిన ఘటన ఇది. కణుపూరుకు చెందిన కె.గోపాలకృష్ణ మండలంలోని కె.గోపాలపురం అత్తవారింటికి వచ్చి తన భార్య, మరికొందరు కలిసి సోమవారం అన్నవరం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గండేపల్లి హైవే పక్కనే తమ గ్రామం వెళ్లేందుకు వేచి ఉన్నారు. ఇంతలో రాజమహేంద్రవరం వైపు నుంచి మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు మోటార్ సైకిల్ దిగి అటు ఇటూ తచ్చాడుతుండగా మోటార్ సైకిల్‌పై ఉన్న మరో వ్యక్తి పడిపోతున్నట్టు గమనించిన గోపాలకృష్ణ పట్టుకునే ప్రయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో అప్పటివరకు అక్కడే తిరుగుతున్న వ్యక్తి వచ్చి గోపాలకృష్ణ జేబులోని సెల్‌ఫోన్‌ను తీసుకుని మోటార్ సైకిల్‌పై జగ్గంపేట వైపు వెళ్లిపోయినట్టు బాధితుడు తెలిపాడు. దీనిపై బాధితుడు గండేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

నేడు విద్యుత్ అంతరాయం

ఏలేశ్వరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వైర్లపై ఉన్న చెట్ల కొమ్మలు, తీగలు తొలగించే నిమిత్తం పట్టణపరిధిలోని రాజమండ్రి కాలనీ, చైతన్య నగర్, క్వారీ పేట, మండలంలోని సి.రాయవరం, రమణయ్యపేట, తూర్పులక్ష్మీపురం, జెఅన్నవరం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సారాతో ఇద్దరి అరెస్టు


సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న స్టేట్ టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలు గ్రామాల్లో టాస్క్‌ఫోర్సు సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. కిర్లంపూడి మండలంలోని తామరాడ, కృష్ణవరం గ్రామాల్లోని సారా స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 1,400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సోమవరం గ్రామంలో సారా విక్రేతలపై దాడులు నిర్వహించి, పెంకే లోవరాజు, దాకే ఏసులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై జీవీ నరసింగరావు, స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.